క్లుప్తంగా

నూరు శాతం ఈ-పంట నమోదు చేయాలి



ఈ-పంట నమోదుపై ఆరా తీస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గణపవరం: ఈ-పంట నమోదు, ఈకేవైసీ నూరుశాతం పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన గణపవరం మండలం పిప్పర పరిసర గ్రామాల్లో ఈ-పంట వెరిఫికేషన్ చేశారు. అన్ని వివరాలు సరిగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 11700 ఎకరాలకు గాను 11287 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశామని వివరించారు. మండలంలో మొత్తం 6425 మంది రైతులకుగాను 2187 మందికి ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన వారి వివరాలను కూడా ఈ నెల పదో తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన



నల్లమాడులో కూటమి నాయకుల ఫ్లెక్సీ దర్శనమిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూసింది. అయితే ఆ కూత మండలంలో అన్ని ప్రాంతాలకు చేరినట్టు లేదు. దీంతో ఇంకా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. మండలంలోని నల్లమాడులో ప్రధాన రహదారి వెంబడి కూటమి నాయకుల ఫ్లెక్సీ దర్శనమివ్వడంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందంటారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వైభవంగా రథ సప్తమి వేడుకలు



రథసప్తమి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: రథసప్తమి వేడుకలు ఉంగుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో క్షీరాన్నం వండి పంపిణీ చేశారు. యోగ ఇన్‌స్ట్రక్టర్ జయలక్ష్మి మహిళలచే యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారిని తాకిన కిరణాలు



స్వామివారిని తాకిన సూర్యకిరణాలు

దెందులూరు: గాలాయగూడెం శ్రీ భీమ నాగ లింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సూర్య కిరణాలు స్వామి వారిని తాకాయి. గ్రామస్తులు భక్తులు మహా అద్భుతంగా ఈ సంఘటనను చెబుతున్నారు. సూర్య కిరణాలు శివలింగాన్ని తాకాయన్న విషయం దావాళంలా వ్యాపించింది. దీంతో భక్తులు శివలింగానికి పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. గతంలో ఎప్పుడు ఇలా సూర్య కిరణాలు శివలింగాన్ని తాకలేదని శ్రీ అచ్చంపేట తల్లి ఉత్సవాల ప్రారంభం రోజున ఇలా జరగటం అమ్మవారి ఆశీస్సులుగా భావిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

మద్ది అంజన్నకు విశేష పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు, తమలపాకుల పూజలు నిర్వహించారు. రథసప్తమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. పలు సేవల రూపేణ మంగళవారం మధ్యాహ్నం వరకు రూ.1,66,132 వచ్చినట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. కార్యక్రమాలను జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

ఆక్రమణల తొలగింపునకు బ్రేక్

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శలు
- తొలగించిన ప్రదేశాల్లో టెంట్లు వెలిశాయి
- ఆక్రమణల్లో వ్యాపారాలు షరామామూలు



ఉంగుటూరు-నారాయణపురం మధ్య స్వచ్ఛందంగా తొలగించిన ఆక్రమణలు

ఉంగుటూరు: అధికారుల నిర్లక్ష్యంతో ఆక్రమణల తొలగింపు మరింత జాప్యం అవుతోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఏలూరు గోదావరి కాలువ వెంబడి ఆక్రమణలు వందలాదిగా పెరిగిపోయాయి. వాటికి విద్యుత్ సర్వీసులు ఇచ్చారు. పంచాయతీలు పన్నులు కూడా కట్టించేసుకున్నాయి. ఆరు దశాబ్దాలకు పైబడి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో ఓ వ్యక్తి ఆక్రమణదారులు మురుగునీరు, ఇతర వ్యర్థాలు ఏలూరు కాలువలో కలవడంతో మంచినీరు కలుషితమవుతుందని లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీనికి కలెక్టర్‌ను బాధ్యులను చేస్తూ ఆక్రమణలను తొలగించమని లోకాయుక్త కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఆక్రమణల తొలగింపునకు అధికారులు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులు రెండు బ్యాచ్‌లుగా హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టేతో తాత్కాలికంగా ఆక్రమణలు తొలగింపు ఆగింది. ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయం చూపించి తొలగించమని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎవరెవరు ప్రభుత్వ లబ్ధి పొందారో జాబితాలను పంచాయతీ కార్యదర్శులు తనిఖీ చేశారు. 90 శాతంపైనే ఆక్రమణదారుల్లో ప్రభుత్వ లబ్ధి పొందారని తేలింది. దీంతో కోర్టుకు వివరించి ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. జనవరి 26వ తేదీన తొలగించాలని మండల అధికారులు సిద్ధమయ్యారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రాజ్‌మనోజ్ పలు శాఖల అధికారులతో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో సీఐ సుబాష్, ఎస్సై సూర్యభగవాన్‌ల రెండు కేసులు దర్యాప్తులో భాగంగా రాజస్థాన్, గుజరాత్ వెళ్లడంతో ఆక్రమణల తొలగింపు 28కి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ నారాయణపురం పంచాయతీ ఆఫీసులో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సిద్ధం చేశారు. ఈ లోపు ఆక్రమణదారుల్లో 60 శాతం మంది స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించారు. ఏమైందో ఏమో ఆక్రమణల తొలగింపుకు బ్రేకు పడింది. ఇదిగో ఎంత పని ఆక్రమణలు తొలగించేస్తున్నామని పంచాయతీ కార్యదర్శులను, రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. అయితే ఆక్రమణలు తొలగింపునకు అయ్యే ఖర్చులు ఎవరు భరించాలనే మీమాంస ఏర్పడింది. ఆక్రమణలు ఉన్న ప్రదేశం ఇరిగేషన్ శాఖ వారు కల్పించుకోకుండా అన్నీ పంచాయతీయే భరించడం ఏమిటి అనే మీమాంసతో ఆక్రమణల తొలగింపు జాప్యం ఏర్పడింది. అంతేగాక పోలీసులు కూడా ఇక్కడ ఉన్న సిబ్బంది సరిపోరని జిల్లాలో పలు స్టేషన్ల ఎస్సైలు, సీఐలు, పోలీసులు కావాలని అలా కావాలంటే జిల్లా ఎస్పీ అనుమతులు తీసుకోవాలని బ్రేకు వేశారు. తహసీల్దార్లు తొమ్మిది మంది కావాలని రెవెన్యూ వారు కోర్రీ వేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారికి ఈ విషయంపై కార్యదర్శులు మండల అధికారులు ఈవోపీఆర్డీ ద్వారా ఫిర్యాదు చేశారు. అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ లోపు కొందరు తిరిగి కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ఫలితంగా ఆక్రమణల తొలగింపుకు బ్రేకు పడింది. మండలంలోని అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ఆక్రమణలు తొలగించే బాధ్యత మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో చంద్రశేఖర్‌పై ఉన్నా అవేవీ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ లోపు ఆక్రమణదారులు తీసేసిన స్థానంలో షామియానా పందిళ్లు వేసుకుని తిరిగి వ్యాపారాలు మొదలు పెట్టారు.



చేబ్రోలు-నారాయణపురం మధ్య తీసేసిన ఆక్రమణల స్థానంలో వెలసిన షామియానా పందిళ్లు



కైకరంలో తొలగించని ఆక్రమణలు

అనుమతులు రాగానే తొలగిస్తాం



అనుమతులు అన్నీ పూర్తయితే ఆక్రమణల తొలగింపు ఏకకాలంలో చేపడతాం. అనుమతులు మా చేతుల్లో లేవు. జిల్లా అధికారులు ఇవ్వాల్సి ఉంది. ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో నిర్వహించాలి. అనుమతి రాగానే ఆక్రమణలు తొలగింపు పూర్తి చేస్తాం. – రాజ్‌మనోజ్, ఎంపీడీవో

మండల యంత్రాంగం సిద్ధం



ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ సహాయం అందించేందుకు మండల యంత్రాంగం సిద్ధంగానే ఉంది. జిల్లా స్థాయి అధికారుల అనుమతులు రాగానే ఆక్రమణల తొలగింపు చేపడతాం. పెద్ద సంఖ్యలో తహసీల్దార్లు కావాలని పోలీసులు అడిగారు. అంత మంది తహసీల్దార్లను నియమించాలంటే జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. అయితే పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన పాత్ర అని వివరించారు. – పూర్ణచంద్ర ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్

కష్ట పడితేనే మంచి ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందించిన మానవత సభ్యులు

గణపవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాలని మానవత సంస్థ రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక, సీనియర్ నాయకుడు పి.హరికుమార్‌రాజు అన్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడు, పిప్పర ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. నిద్రాహారాలు మాని చదవడం కన్నా, ప్రణాళిక ప్రకారం రోజూ కనీసం పది గంటలు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థి జీవితానికి మలుపుని, ఇక్కడ సాధించిన ఫలితాలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సుబ్బరాజు, వంకాలయ రామారావు, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

పెదవేగి : మండలంలోని అంకన్నగూడెం, కొప్పాక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు హాజరైయ్యారు. అధికారులు వారి శాఖాలకు సంబంధించిన విషయాలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జేడీ కార్యాలయ ఏడీఏ శైలజ, మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక, హెచ్‌ఓ రత్నమాల, సెరీకల్చర్ ఆఫీసర్ కుమారి, వెటర్నరీ డాక్టర్ సుందర్‌సింగ్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం



భీమడోలులో రంగు రంగులతో ముస్తాబైన అమ్మవార్ల ఆలయం



దేదీప్యమానంగా ఉన్న విద్యుత్ లైటింగ్

- 7 నుంచి నుంచి జాతర ప్రారంభం
- దేదీప్యమానంగా విద్యుత్ దీపాలంకరణ
- అమ్మవారికి ప్రత్యేక పూజలు

భీమడోలు: అమ్మవార్ల జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. భీమడోలు సంతమార్కెట్ వద్ద గ్రామదేవతలుగా వెలుగొందుతున్న శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజు, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ పుష్కర జాతర సంబరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఉత్సవ నిర్వహణ కమిటి పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. 12 ఏళ్లకోసారి వచ్చే ఈ జాతర సంబరాలను ఈ నెల ఏడో తేదీ నుంచి మార్చి తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తారు. మేజర్ పంచాయతీలోని 2700 కుటుంబాలకు అమ్మవార్లు కోర్కెలు తీర్చే శక్తిస్వరూపిణిలుగా పూజలందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవార్ల జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, సంతమార్కెట్ రోడ్డుపై దేదీప్యమానమైన విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటి అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కమిటి సభ్యులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ఏకతాటిపై ఉండి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల ఆరో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు పోతురాజును మేళాతాళాలతో గ్రామ పోలిమేరలు కడతారు. ఆ మరసటి రోజు నుంచి జాతర మహోత్సవాల్లో రూపొందిన పూజలు చేస్తారు. మార్చి ఎనిమిదో తేదీ శనివారం రాత్రి కుంభం పోయడం, పొలిచేట తిరుగుతుంది. తొమ్మిదో తేదీతో జాతర ముగుస్తుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

ఉంగుటూరు: మండలంలోని చినవెల్లమిల్లి, నీలాద్రిపురం రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎన్ఎస్ ప్రవీణ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి దేవదానం రైతులకు వివరించారు. ప్రస్తుతం పంట నమోదు కార్యక్రమం ఈ నెల 20వ తేదీన ముగుస్తుందని, రైతులందరూ వారి పంటల వివరాలు రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఎన్‌పీఎస్ఎస్ యాప్ రైతులందరూ వినియోగించుకోవాలని, దాని ద్వారా రైతులు వారే వారి మొబైల్‌లో పంటల చీడపీడల ఉధృతి, వాటిక నివారణ సమాచారం పొందవచ్చని తెలియజేశారు. రైతులకు పాడిపంటలు మాసపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో చిన్న వెల్లమిల్లి, నీలాద్రిపురం రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రణాళికా బద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని మానవతా రాష్ట్ర అభివృద్ధి కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకీ రామరాజు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం కాగుపాడు హై స్కూల్ పదో తరగతి విద్యార్థులకు మానవత నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదో తరగతిలో ప్రతిభ కలిగిన ఆరుగురు విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తాతిన వెంకన్నబాబు, మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, చైర్మన్ గుణ్ణం బుల్లెబ్బాయ్, కడియాల చిట్టిబాబు, వంకిన ప్రతాప్, శీతాల సత్యనారాయణ, గంజి రవి కుమార్, కోనే వీర వెంకట సత్యనారాయణ, సర్వేశ్వర రావు, వంశీ సుబ్బరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



విశేషాలంకరణలో అచ్చమ్మ పేరంటాల అమ్మవారు



దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ ఆల య 68వ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రారంభోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శర్మ అచ్చమ్మ అమ్మవారికి మొదటి రోజు పసుపు అలంకరణ చేశారు. సాయంత్రం చిన్నారుల కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రదర్శన చేసిన చిన్నారులను అభినందించారు. పోలీస్ అవుట్ పోస్టు, వైద్య శిబిరం, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ యువత అమ్మవారి ఉత్సవాల్లో వాలంటరీగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రవేశ పరీక్షలో ప్రశాంత్‌కు ప్రథమ స్థానం



వీధి ప్రశాంత్

గణపవరం: ఎడ్యుకేషన్ ఎఫిషియన్సీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈఈఎంటీ ప్రవేశ పరీక్షలో గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామానికి చెందిన వీధి ప్రశాంత్‌కు జిల్లా స్థాయి ప్రథమ స్థానం లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ సంస్థ ఏటా ఈఈఎంటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది. ముప్పర్తిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రశాంత్ ఏడో తరగతి చదువుతున్నాడు. ప్రశాంత్‌ను, అతడికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంఈవోలు రాజేష్, గౌర్రెల బాలయ్య, సర్పంచ్ కర్రిరాధాలక్ష్మి, పిల్లి సంతోషం, బదరీనారాయణ, హెచ్‌ఎం అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మలేరియా అధికారి ప్రసాద్

దెందులూరు: ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ సూచించారు. పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశా డే కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యంగా దోమల ద్వారా వచ్చే వ్యాధులు పట్ల ప్రజలకు వివరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో డెంగ్యూ జ్వరాలు తరచూ సంభవిస్తాయని మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరిగే ఎడీస్ రకం దోమ కుట్టడం వల్ల మనకు సంక్రమిస్తాయని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎన్‌సీడీ సీడీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అరుంధతి, హెల్త్ సూపర్‌వైజర్ సత్యవతి హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ యుగేష్, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి



దెందులూరు: సమావేశంలో బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు



ఉంగుటూరు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి మరింత అవగాహన ఉండాలని నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ నూకరాజు అన్నారు. మంగళవారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో వరల్డ్ క్యాన్సర్ డేపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ మనిషికి ప్లాస్టిక్ వస్తువులు కవర్లు ప్రభావం వల్ల వ్యాయామం లేకపోవడం, వేట మాంసం తినటం, పొగాకు తాగటం వల్ల క్యాన్సర్ వ్యాధి వస్తుందన్నారు. వైద్యుల సూచనలు సలహాలు పాటిస్తూ క్యాన్సర్ మందులు వాడాలన్నారు.



గణపవరం: క్యాన్సర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీబీటీ రాజు

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

ఉంగుటూరు: క్యాన్సర్ అంటే అపోహ వద్దని ఉంగుటూరు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. మంగళవారం క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుని మెరుగైన వైద్యం తీసుకుంటే క్యాన్సర్‌ను అధిగమించొచ్చన్నారు. అన్ని రకాల క్యాన్సర్లకు చికిత్స ఉందని, అపోహ వద్దని, ముందుగా గుర్తిస్తే 90 శాతం వరకు ట్రీట్‌మెంట్ చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో క్యాన్సర్

గణపవరం: గుట్కా, పాన్‌పరాగ్, ఆల్కహాల్, ధూమపానం తదితర చెడు అలవాట్లు క్యాన్సర్‌కు దారితీస్తాయని, అందువల్ల ప్రజలు వీటికి దూరంగా ఉండాలని అఖిల భారత పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. మంగళవారం క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గణపవరం ఏరియా పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల కార్యదర్శి శివశ్రీనివాసరావు పాల్గొన్నారు.